నవశకానికి నాంది..!



అమరావతిలో మాజీ మంత్రి పల్లె, ఎంపీలు అంబికా, పార్థ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, పరిటాల సునీత, బండారు శ్రావణి, పల్లె సింధూర, ఎంఎస్ రాజు



జాతీయ రహదారి 44లో ఎర్రమంచి, గుడిపల్లి వద్ద నిర్మించే ఆర్‌ఓబీ నమూనా

అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపన

- నాలుగు లేన్లుగా గోరంట్ల-హిందూపురం రోడ్డు విస్తరణ
- 43.58 కి.మీ.కు రూ.809 కోట్లు కేటాయింపు
- రూ.124 కోట్లతో కియ, గుడిపల్లి వద్ద ఆర్ఓబీ
- గుంతకల్లు రైల్వే డివిజన్‌లో రెండు ప్రాజెక్టులకు శ్రీకారం

పుట్టపర్తి/గుంతకల్లు మే 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గోరంట్ల- హిందూపురం రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించనున్నారు. ఈక్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ సీఎం చంద్రబాబుతో కలిసి అమరావతి నుంచి వర్చువల్‌గా రోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. 43.58 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులను రూ.809 కోట్లతో చేపట్టనున్నారు. ఇప్పటికే జిల్లాలో జాతీయ రహదారి 716జీని కడప జిల్లా ముద్దనూరు నుంచి హిందూపురం దాకా నాలుగు వరుసలుగా విస్తరిస్తున్న విషయం తెలిసిందే. మొదటి ప్యాకేజీ కింద కడప జిల్లా ముద్దనూరు నుంచి తలుపుల మండలం బీకొత్తపల్లి వరకు రూ.1020 కోట్లతో పనులు చేపట్టనున్నారు. బీకొత్తపల్లి నుంచి కదిరి మీదుగా గోరంట్ల దాకా రెండో ప్యాకేజీ కింద పనులు తుదిదశకు వచ్చాయి. తాజాగా గోరంట్ల-హిందూపురం (మిగతా 6లో..)



బుగ్గబావికి బిగించిన ఆరు విద్యుత్ మోటార్లు

తగ్గని బుగ్గ

300 ఏళ్లుగా ఎండిపోని బుగ్గబావి

ఎంత కరువు వచ్చినా నిండుగా నీరు

వేసవిలోనూ బావికింద 25 ఎకరాల సాగు

ఆశ్చర్యం కలిగిస్తున్న మండ్లిపల్లి బావి నీటి జాడ

తీవ్ర వర్షాభావం నేపథ్యంలో జిల్లాలో వందల అడుగుల లోతు తవ్వినా చుక్కనీరు దొరకని పరిస్థితి. ఒక వేళ అరకొరగా నీరు లభించినా ఎన్ని రోజులు వస్తాయో చెప్పలేని స్థితి. అయితే కేవలం 30 అడుగుల లోతు ఉన్న ఓ బావి మాత్రం 300 ఏళ్ల నుంచి ఎండిపోకుండా నీటితో తొణికిసలాడుతోంది. అదే మండలంలోని మండ్లిపల్లి వద్ద జాతీయ రహదారి 42న పక్కన ఉన్న బుగ్గబావి. ఎలాంటి కరువు పరిస్థితులు వచ్చినా ఈ బావిలో నీరు తగ్గిందే లేదు. -ఆంధ్రజ్యోతి, తనకల్లు



బుగ్గబావి కింద సాగు చేసిన వివిధరకాల పంటలు

40 కుటుంబాలకు ఆధారం

ప్రస్తుతం బుగ్గబావికి ఆరు విద్యుత్ మోటార్లను అమర్చారు. ఆ నీటిని వాడుకుంటూ వ్యవసాయం చేస్తున్నారు. బావికింద 40కుటుంబాలు ఈ బావి నీటిని ఆధారంగా చేసుకుని వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నాయి. 55ఎకరాలు బావి కింద సాగు ఉండగా, ప్రస్తుత వేసవిలో సైతం 10 ఎకరాల్లో వరి, 15 ఎకరాల్లో టమోటా, పశువుల గడ్డి పెంచుతున్నారు. గతంలో ఈ బావికింద 50 ఎకరాల్లో మల్బరీ తోటలు సాగుచేసేవారు. వాటి వల్ల వచ్చిన ఆదాయంతోనే పిల్లలను చదివించి, ప్రయోజకులను చేశారు. ఈక్రమంలోనే 55 మంది సాఫ్టువేర్, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. గ్రామం చుట్టు వెయ్యి అడుగులకు పైగా బోర్లు తవ్వినా రాని నీరు బుగ్గబావిలో 30 అడుగుల్లోనే ఆరు విద్యుత్ మోటార్లకు కావలసిన నీటిని సరఫరా చేస్తోంది. ఆరు మోటార్లు ఆన్ చేసిన సమయంలో కాస్త నీరు తగ్గినా రెండు మోటార్లకు మాత్రం నిరంతరాయంగా అందిస్తున్న ట్లు రైతులు తెలిపారు. ఈనేపథ్యంలో గ్రామస్థులు కూడా బావిని సురక్షితంగా కాపాడుకుంటున్నారు.

మాపెద్దలు చెప్పారు



మూడు వందల ఏళ్లుగా ఈ బావి ద్వారానే పంటలు పండిస్తున్నట్లు మా తాతలు, ముత్తాతలు చెప్పారు. మేము చిన్నగా ఉన్నప్పుడు ఆరు మోటార్ల నుంచి వచ్చే నీరు ఒకే కాలువ గుండా వెళ్లినా, ఎప్పుడూ గొడవ పడలేదు. ప్రస్తుతం ఆరు మోటార్లు పని చేస్తున్నాయి. అన్నింటికి పైపులైన్లు ఏర్పాటు చేసుకున్నాం. గతంలో సంతకు వెళ్లేవారు, జాతీయ రహదారిపై వెళ్తున్న ప్రయాణికులు మా బావి వద్దకు వచ్చి దాహార్తి తీర్చుకుని అక్కడే ఉన్న మేడిచెట్టు కింద సేదదీరేవారు. ప్రస్తుతం వాటర్‌బాటిళ్లు రావడంతో బావినీరును ఎవరు ఉపయోగించడంలేదు.

- భాస్కర్‌రెడ్డి, రైతు, మండ్లిపల్లి

మోటార్లు పైకి వచ్చేలా ఏర్పాట్లు

బుగ్గబావికి గతంలో ఇనుప పైపులు అమర్చి, విద్యుత్ మోటార్లు బిగించారు. వర్షాలు పడినప్పుడు నీరు పైకి వచ్చి పొంగి పొర్లడంతో మోటార్లలన్నీ మునిగిపోయేవి. దీంతో తీవ్ర నష్టం జరిగేది. అందుకే బావికింద సాగు ఉన్న రైతులు ప్లాస్టిక్ డ్రమ్ములకు పైపులను ఏర్పాటు చేసి సబ్‌మెర్సిబుల్ మోటార్లు బిగించారు. దీంతో ఉన్నట్లుండి నీరు పైకి వచ్చినా, మోటార్లుకూడా పైకి వస్తాయి. రైతులకు కూడా ఎలాంటి నష్టం కలగదు. గతంలో ఉమ్మడి జిల్లాలో తీవ్ర కరువు ఏర్పడినప్పుడు బుగ్గబావిలో నీరు వస్తుండటాన్ని పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు పరిశీలించారు. ఇది నేటికీ ఎందరికో ఆశ్చర్యం కలిగిస్తోంది.

పిల్లలను బాగా చదివించాం



మా గ్రామంలో 40 కుటుంబాల వారు బుగ్గబావి నీటి మీదనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నాం. మా పిల్లలు 55మంది బాగా చదివి సాఫ్టువేర్, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. నా కుమార్తె, కుమారుడుని కూడా ఇంజనీరింగ్ చదివించా. ప్రస్తుతం మా పిల్లలు ఉద్యోగంలో స్థిరపడ్డారు. నేటికి కూడా వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నాం. మండ్లిపల్లి బుగ్గబావికి ఘనచరిత్ర ఉంది. బుగ్గబావి ఒకప్పుడు గ్రామ దాహార్తిని కూడా తీర్చింది. నేటికి కూడా బుగ్గ బావిని గ్రామస్థులందరం కలిసి సంరక్షించుకుంటున్నాం.

- మాధవరెడ్డి, రైతు, మండ్లిపల్లి

బాలయ్య సన్మానానికి ఏర్పాట్లు

పదివేల మంది కూర్చునేలా సిద్ధం



క్రీడా మైదానంలో పూజల్లో పాల్గొన్న నాయకులు

హిందూపురం, మే2(ఆంధ్రజ్యోతి): పద్మభూషణ్ అవార్డు అందుకున్న తర్వాత తొలిసారిగా హిందూపురానికి విచ్చేస్తున్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ఆదివారం పౌర సన్మానసభ ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నాయకులు శుక్రవారం పూజ చేసి ప్రారంభించారు. సభావేదిక, వీఐపీలు వచ్చేదారికి సంబంధించిన పనులు చేపట్టారు. ఎంజీఎం క్రీడామైదానంలో ఎమ్మెల్యేలు వివిధ జిల్లాల నుంచి వచ్చే ముఖ్యమైన ప్రతినిధుల కోసం వెయ్యి కుర్చీలు, వీవీఐపీలకు 2వేల కుర్చీలు, వీఐపీలకు మూడు వేల కుర్చీలు, సాధారణ గ్యాలరీలో 4వేల కుర్చీలు ఏర్పాటు చేశారు. వచ్చే జనాలను బట్టి మరన్ని ఏర్పాట్లు చేస్తామని నిర్వాహకులు వెల్లడించారు. మైదానంలో భారీ ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులన్నింటిలో ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పట్టణ ప్రధాన కూడలిలో భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మునిసిపల్ చైర్మన్ రమేష్, డా.సురేంద్ర, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, పీఏ వీరయ్య, నాగరాజు, పరిమళ, బేవనహళ్లి ఆనంద్, మంగేష్, మంజునాథ్, తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దశాబ్దాల కల నెరవేర్చిన మంత్రి సవిత

రూ.3 కోట్లతో రాంపురం-కురుబవాండ్లపల్లి తారురోడ్డు

పెనుకొండ రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు గ్రామాల ప్రజల దశాబ్దాల కలను బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత నెరవేర్చారు. కొన్నేళ్లుగా సరైన రోడ్డు లేక రాంపురం, కురుబవాండ్లపల్లి గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, నిధులు మంజూరు చేయించారు. రాంపురం నుంచి కురబవాండ్లపల్లికి రోడ్డు నిర్మాణానికి రూ.3.60కోట్ల ఉపాధి నిధులు మంజూరు కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు పంచాయతీరాజ్ డీఈ తిరుమలరెడ్డి తెలిపారు.



రాంపురం-కురుబవాండ్లపల్లి రోడ్డు

ఎలుగుబంట్ల ఫొటోలుంటేనే పరిహారం!

అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ వింత ధోరణి

ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత రైతు

మడకశిర రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగుచేసిన కర్బూజ పంటను ఎలుగుబంట్లు ధ్వంసం చేయడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న అన్నదాతకు అటవీ అధికారి నుంచి వింత సమాధానం ఎదురైంది. ఎలుగుబంట్లు తోటలలోకి వచ్చి, పంటను ధ్వంసం చేసిన ఫొటోలు, ఆధారాలు ఉంటేనే పరిహారం పంపిణీకి ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని చెప్పడంతో షాక్ అవడం అన్నదాత వంతైంది. నాగభూషణ రెడ్డి సాగుచేసిన కర్బూజ పంటను ఎలుగుబంట్లు గతనెల 30న ధ్వంసం చేశాయి. దీంతో రైతు తీవ్రంగా నష్టపోయాడు. విషయాన్ని అటవీ అధికారులకు వెంటనే తెలిపాడు. పంట పరిశీలనకు అటవీ అధికారులు గురువారమే రావాల్సి ఉంది. కానీ రాలేదు. దెబ్బతిన్న కాయలను అలానే ఉంచుకుంటే పంట కోత కోసం వచ్చే వ్యాపారులు వెనుదిరుగుతారన్న ఉద్దేశంతో రైతు వాటిని తొలగించాడు.

అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ కుళ్లాయప్ప తాపీగా శుక్రవారం పంట పరిశీలనకు వెళ్లాడు. నష్టపోయిన రైతుకు అండగా నిలవాల్సింది పోయి, వింత ప్రశ్నలు వేశాడు. 'ఎలుగుబంట్లు తోటలోకి ప్రవేశించినట్లు ఫొటోలు ఉన్నాయా?' అని అడిగారు. రాత్రిపూట ఎలుగుబంట్లు తోటలోకి వస్తాయనీ, ఆ సమయంలో ఫొటోలు ఎలా తీస్తారని బాధిత రైతు వాపోతున్నాడు. ఎలుగుబంట్లను చూసి ఉండుంటే వాటిని తరిమేవారమనీ, పంటను తినేస్తుంటే చూస్తూ ఊరుకునేవారం కాదని అన్నదాత ఆవేదన చెందాడు. అంతేకాదు, ఎలుగుబంట్లు ధ్వంసం చేసిన కాయలను తొలగించడంతో పరిహారానికి సిఫార్సు చేయడం కుదరని సెక్షన్ ఆఫీసర్ చెప్పుకొచ్చారు. రైతుకు నష్టం వాటిల్లిదంటే వెంటనే రావాల్సిన కనీస బాధ్యతను మరచిన సెక్షన్ ఆఫీసర్ గురువారం రావాల్సింది పోయి.. ఒకరోజు ఆలస్యంగా వచ్చి.. కాయలు అలాగే ఉంచమంటే ఎలాగని రైతు అసహనం వ్యక్తం చేశాడు. ఇలాంటి అధికారులు ఉంటే.. కరువు రైతులకు ఏం న్యాయం చేకూరుతుందని స్థానికులు వాపోయారు.

అయ్యో.. నాన్నా..

విద్యుదాఘాతంతో ఒక్కగానొక్క కుమారుడి మృతి

సబ్‌జైలులో స్పృహ తప్పిన తండ్రి

(7వ పేజీలో..)

వలంటీర్ల ఫోన్లు భద్రమేనా?

ఎన్నికల ముందు స్వాధీనం చేసుకున్న అధికారులు

ఏడాది కాలంగా వృథాగా ఉంచిన వైనం

ఇప్పుడు అవి పనికొస్తాయో లేదో?

ధర్మవరం, మే 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో వలంటీర్లకు ఇచ్చిన సెల్‌ఫోన్లు పని చేస్తాయా? ఎన్నికల ముందు స్వాధీనం చేసుకున్న వాటిని భద్రంగానే ఉంచారా? ప్రస్తుతం వాడకానికి పనికొస్తాయా? కోట్లు ఖర్చు చేసి కొనుగోలు చేసిన వాటిని ఏడాది కాలంగా వృథాగా ఎందుకు ఉంచారన్న ప్రశ్నలు వేధిస్తున్నాయి. గతంలో వైసీపీ హయాంలో వేల రూపాయల విలువైన ఆండ్రాయిడ్ ఫోన్‌ను కొనుగోలుచేసి వలంటీర్లకు అందజేశారు. వీటి ద్వారా క్షేత్రస్థాయిలో పథకాలకు అర్హులు, అనర్హుల డేటాను సేకరించారు. వివిధ రకాల సర్వేలు చేయించారు.



రేషన్ పంపిణీ మొదలుకొని ధాన్యం సేకరణ, ఇతర సబ్సిడీలు, డీబీటీ పథకాలను వీటి ద్వారానే అందజేశారు. లబ్ధిదారులకు ఏ పథకం అమలు చేయాలన్నా ఈ ఫోన్‌ల ద్వారానే జరిగేది. 50 కుటుంబాల సమాచారం ఈ ఒక్క ఫోన్‌లోనే నిక్షిప్తమై ఉండేది. జిల్లాలో 8వేల మంది వలంటీర్లు పని చేశారు. గతంలో వీరందరికి ఫోన్‌లు పంపిణీ చేశారు. అయితే గత ఎన్నికల సమయంలో వలంటీర్ల వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకోవాలని ఎన్నికల కమిషన్ జిల్లా అధికారులను ఆదేశించింది. దీంతో జిల్లాలోని వలంటీర్ల నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ఆయా మండల ఎంపీడీఓ కార్యాలయంలో భద్రపరిచారు. మున్సిపాలిటీల్లో అయితే కొన్నింటిని కలెక్టరేట్‌కు పంపగా మిగిలిన వాటిని ఆయా వార్డు సచివాలయాల్లోనే భద్రపరిచినట్లు సమాచారం. ఇవి ఇప్పుడు పని చేస్తాయో లేదో తెలియని పరిస్థితి.

ఎస్ఈ బాధ్యతల స్వీకరణ



పుట్టపర్తి టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈగా సంపత్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సురేంద్ర ఉద్యోగ విరమణ చేయడంతో సంపత్ కుమార్‌ను నియమించారు.





పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం

అద్భుతంగా అమరావతి



కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు

మహిళల విజయ దరహాసం

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోం దని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం

నవశకానికి నాంది..!

(5వ పేజీ తరువాయి)

నాలుగు వరుసల రహదారి విస్తరణకు ప్రధాని శంకుస్థాపన చేశారు. దీంతో జిల్లాలో ప్రధాన, జాతీయ రహదారుల అనుసంధానం జరిగి రవాణా సౌకర్యాలు మెరుగపడనున్నాయి. కదిరి, హిందూపురం, గోరంట్ల, పాలసముద్రం, పెనుకొండ, మడకశిర ప్రాంతాలకు రవాణా కనెక్టివిటీ పెరిగి పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో అభివృద్ధి ప్రాజెక్టులు రానున్నాయి. తద్వారా జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవనున్నాయి.

పరిశ్రమల కోసం ఆర్‌ఓబీలు

ఎర్రమంచి కియ కార్ల పరిశ్రమతోపాటు గుడిపల్లి పారిశ్రామిక పార్కు వద్ద, కియ కార్ల అనుబంధ సంస్థలకు అనుసంధానంగా జాతీయ రహదారి 44 వద్ద ఆర్‌ఓబీల నిర్మాణాలను రూ. 124 కోట్లతో చేపట్టనున్నారు. ఈరెండు చోట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రధానమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. కియ కార్ల పరిశ్రమ ప్రధాన ప్లాంటు నుంచి అనుబంధ సంస్థలకు అనుసంధానంగా, జాతీయ రహదారికి అనుసంధానంగా ఆర్‌ఓబీల నిర్మాణం జరిగితే రవాణా సౌకర్యం మెరుగవడంతో పాటు ప్రమాదాలకు చెక్ పడుతుంది. గుడిపల్లి పారిశ్రామిక వాడలో ఆటోమొబైల్ పరిశ్రమ, కియ అనుబంధ సంస్థలు, పాలసముద్రం వద్ద బెల్, నాసిన్ పరిశ్రమలకు అనుసంధానంగా రవాణా సౌకర్యం కలగనుంది. అదే విధంగా ట్రాఫిక్ సమస్యకు చెక్ పడనుంది.

అభివృద్ధికి అనుసంధానం

జిల్లాలో బెంగళూరు- హైదరాబాద్ నగరాలను కలుపుతూ పెనుకొండ, కొడికొండ చెక్‌పోస్టు మీదుగా విస్తరించిన నాలుగు వరుసల (44వ) జాతీయ రహదారిని 12 వరుసలతో విస్తరణకు కేంద్రం గత ఏడాదే ప్రాథమికంగా ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇది కార్యరూపం దాల్చితే జిల్లా అభివృద్ధిలో నవశకం మొదలవుతుంది. కడపజిల్లా మీదుగా బెంగళూరు - విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే జిల్లాలో తలుపుల మండలం లక్కసముద్రం, ఓడులపల్లె గ్రామాల పరిధిలో ప్రారంభమై చిలమత్తూరు మండలం కోడూరు వద్ద 44 జాతీయ రహదారితో కలవనుంది. నాలుగు, ఆరు వరుసలతో నిర్మించే ఈ రోడ్డు పొడవు జిల్లాలో 75 కిలోమీటర్లు ఉండనుంది. గత టీడీపీ ప్రభుత్వం హయంలోనే కొడికొండ-శిర మధ్య 56.80 కి.మీ మేర రూ. 556 కోట్లతో జాతీయ రహదారి 544ఈ నిర్మాణం చేపట్టారు. ముదిగుబ్బ పుట్టపర్తి మీదుగా కోడూరు దాకా జాతీయ దహదారి 342 నిర్మాణం తుది దశకు వచ్చింది. కదిరి- గోరంట్ల దాకా జాతీయ రహదారి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. జిల్లా సరిహద్దుకు 80 కిలోమీటర్లు దూరంలో దేవనహళ్లి అంతర్జాతీ విమానాశ్రయం ఉండటం, రోడ్ల అభివృద్ధి, అనుసంధానంతో జిల్లా అభివృద్ధికి మార్గం ఏర్పడనుంది.



గోరంట్ల- హిందూపురం రహదారి

రైల్వే ప్రాజెక్టులు ప్రారంభం

గుంతకల్లుకు సంబంధించిన రెండు రైల్వే ప్రాజెక్టులకు ప్రధాని మోదీ పచ్చజెండా ఊపారు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు సమీపంలోని వెస్ట్ గుంతకల్లు రైల్వే స్టేషన్ నుంచి మల్లప్పగేట్ వరకూ (గోవా-విజయవాడ లైన్ల అనుసంధానానికి) రూ. 293 కోట్లతో నిర్మించనున్న రైల్ ఓవర్ రైల్ బైపాస్ లైన్ నిర్మాణానికి శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేశారు. అలాగే గుంతకల్లు-గుంటూరు డబ్లింగ్ కార్యక్రమంలో భాగంగా బుగ్గనపల్లి-బీ సిమెంట్ నగర్-పాణ్యం స్టేషన్ల మధ్య విద్యుద్దీకరించిన డబుల్ లైన్ నిర్మాణపు పనులు పూర్తికావడంతో ఆ రైల్వే సెక్షన్‌ను జాతికి అంకితం చేశారు. ప్రధాని శంకుస్థాపన చేసిన వెస్ట్‌గుంతకల్లు-మల్లప్పగేట్ ప్రాజెక్టు , బుగ్గనపల్లి-పాణ్యం సెక్షన్ ప్రారంభోత్సవం వల్ల విజయవాడ లైన్‌లో గూడ్సు, ఎక్స్‌ప్రెస్ రైళ్ల కనెక్టివిటీ పెరిగి ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమవుతుంది. విజయవాడకు కొత్త రైళ్ల డిమాండ్ ఎక్కువగా ఉన్నా ట్రాక్ సౌలభ్యం లేకపోవడంతో కొత్త రైళ్లను ప్రవేశపెట్టలేదు. డబ్లింగ్ పూర్తయితే రాష్ట్ర రాజధానికి, కొత్త జోనల్ కేంద్రానికి వెళ్లడానికి కొత్త రైళ్లు వచ్చే అవకాశాలు ఏర్పడతాయి. అలాగే వెస్ట్‌గుంతకల్లు-మల్లప్పగేట్ బైపాస్ లైన్ నిర్మాణం జరిగితే కర్ణాటకలోని జిందాల్, తదితర పరిశ్రమల నుంచి సరుకు రవాణా వేగవంతం అవుతుంది. పైగా ప్రస్తుతం గోవా వైపు నుంచి కాకినాడ పోర్టుకు వెళ్లే సరుకు రవాణా రైళ్లు గుంతకల్లు రైల్వే స్టేషన్‌లోకి రావాల్సిన పరిస్థితి ఉంది. బైపాస్ పూర్తయితే గూడ్సు రైళ్లు గుంతకల్లు స్టేషన్ గుండా కాకుండా నేరుగా వెళ్తాయి. దీంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లను సమయానుకూలంగా నడిపే అవకాశం ఏర్పడుతుంది.



వెలగపూడిలో ప్రధానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్వాగతం.. చిత్రంలో సీఎం



సభలో మంత్రి సవిత..



వేదిక వద్ద ప్రధాని మోదీకి మంత్రి సత్యకుమార్ స్వాగతం

హోరు గాలి.. జోరు వాన..!



అనంతపురం నగరంలో వర్షం

అనంతపురం అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అనంతపురం, శింగనమల, గార్లదిన్నె, నార్పల, యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. పుట్లూరు, పామిడి ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. ఈదురుగాలులతో అనంతపురం నగరంలో 8.30 గంటల నుంచి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

పగటిని తలపించేలా నింగి.. నేల.. అనంతపురం నగరంలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో..



అమరావతి సాకారానికి శ్రీకారం

● చంద్రబాబు పాలనాదక్షతకు దర్పణం

● పనుల పునఃప్రారంభోత్సవంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతనిధులు

అనంతపురం, మే 2(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రుల కలల రాజధాని అమరావతి సాకారానికి శ్రీకారం చుట్టడం మాకు ఆనందాన్నిస్తోంది. ప్రధానమంత్రి మోదీ చేతుల మీదుగా రాజధాని పనుల పునఃప్రారంభమైనందుకు ఎంతో గర్వపడుతున్నాం. మే 2వ తేదీ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే రోజు. మరీ ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనాదక్షతకు ఇదో దర్పణమ'ని జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కొనియాడారు. అమరావతిలో శుక్రవారం నిర్వహించిన రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవ సభకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఎన్డీఏ ప్రజాప్రతినిధులందరూ హాజరయ్యారు. మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, సత్యకుమార్‌యాదవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుతోపాటు ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరైన ఈ సభలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. అమరావతిని విధ్వంసం చేసిన చరిత్ర జగన్‌కే దక్కుతుందని మండిపడ్డారు. రాష్ట్రానికి రాజధాని ఏదని చెప్పుకోలేని పరిస్థితిలో వైసీపీ పాలన సాగడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న దురదృష్టమన్నారు. వైసీపీ విధ్వంసకర పాలనకు ప్రజలు చరమగీతం పాడి కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా ఆంధ్రుల కలల రాజధాని అమరావతి నిర్మాణానికి బాటలు వేశారన్నారు. ఇది ప్రతి ఆంధ్రుడికి గర్వకారణమన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఆగిపోయిన రాజధాని పనులను ప్రధాని మోదీ పునఃప్రారంభించడం శుభపరిణామమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బలమైన సంకల్పంతోనే అమరావతి దేశంలోని మహానగరాల చెంతన చేరబోతుందనడంలో సందేహం లేదని వారు స్పష్టం చేశారు. ఏపీ భవిష్యత్తును మారుస్తూ ప్రపంచ స్థాయి రాజధాని నగరానికి బీజం పడడం శుభ తరుణంగా వారు పేర్కొన్నారు.

పెద్దారెడ్డి అంటే నాకు సరిపోదు: జేసీపీఆర్

పెద్దవడుగూరు, మే 2(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అంటే తనకు సరిపోదని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గతంలో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఫ్యాక్షన్ మొదలుపెడతానని బహిరంగంగానే హెచ్చరించారన్నారు. అలాంటి విషపు ఆలోచనలు ఉన్న వారు గ్రామాల్లో అన్నదమ్ములుగా జీవిస్తున్న ప్రజల మధ్య చిచ్చు పెడతానంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మండల వైసీపీ నాయకులు ఏర్పాటు చేసే విందులకు పెద్దారెడ్డిని మినహా ఎవరినైనా ఆహ్వానించుకోవచ్చని తెలిపారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకులు ఎస్‌వీ రవీంద్రారెడ్డి, జిల్లా తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ దివాకర్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్సీ మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ నిరుద్యోగ మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ఇవ్వనున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 30 మంది ఎస్సీ మహిళలకు శిక్షణ ఇస్తామన్నారు. రెండు నెలలపాటు సాగే శిక్షణకు 18 నుంచి 35 ఏళ్ల వయసువారు అర్హులన్నారు. ఆసక్తిగల వారు విద్యార్హత సర్టిఫికెట్‌తోపాటు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, రెండు ఫొటోలతో సాయినగర్ 1వ క్రాస్‌లోని 30వ నంబరు వార్డు సచివాలయం వద్దనున్న స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 9908620306 నంబరులో సంప్రదించాలన్నారు.

నేడు బాస్కెట్‌బాల్ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, మే 2(ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్‌బాల్ జూనియర్ జట్ల ఎంపిక పోటీలు శనివారం ఉదయం 8 గంటలకు అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. 2012 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన బాలబాలికలు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల వారు జననధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు చిత్తూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు.

ఉద్యోగం పేరుతో రూ.23 లక్షలు వసూలు

నిందితుడి అరెస్టు

ఉరవకొండ, మే2(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానని మహిళను నమ్మబలికి రూ.23 లక్షలు వసూలు చేసి, మోసం చేసిన కేసులో నిందితుడు వీరబోయనేని మహేష్ అలియాస్ అక్షయ్‌నందన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు.. వెల్లడించారు. పట్టణంలోని ఇంద్రానగర్‌కు చెందిన మహిళకు నెల్లూరుకు చెందిన వీరబోయనేని మహేష్ సోషల్ మీడియాలో పరిచయమయ్యాడు. ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రూ.23 లక్షలు కాజేశాడు. ఉద్యోగం ఇప్పించకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు జనవరిలో పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం అనంతపురం రహదారిలోని కేకే పెట్రోల్ బంకు వద్ద నిందితుడిని అరెస్టు చేసి, సెల్‌ఫోన్ రూ.70వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు వచ్చేలా చూడండి

జడ్పీ సీఈఓకు బాధిత ఉద్యోగుల వినతి

అనంతపురం విద్య, మే 2(ఆంధ్రజ్యోతి): రికార్డు అసిస్టెంట్లతో సమానంగా స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్లు.. జడ్పీ సీఈఓను కోరారు. సంఘాల నాయకులతో కలిసి వారు శుక్రవారం జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డిని ఆయన చాంబర్‌లో కలిశారు. వారు మాట్లాడుతూ... టీడీపీ హయాంలో ల్యాబ్, లైబ్రరీ అటెండర్ల సమస్యలపై ఉన్నత కమిటీ వేశారన్నారు. కమిటీ సిఫార్సుల ఆధారంగా ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్లుగా రీ-డిసిగ్నేట్ చేశారన్నారు. రికార్డు అసిస్టెంట్లతో సమానంగా ప్రయోజనాలు కల్పించేలా ఉత్తర్వులు ఇచ్చారన్నారు. వాటిని అమలు చేశారన్నారు. జగన్ సీఎం అయ్యాక గతంలో చంద్రబాబు ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేశారన్నారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోయామన్నారు. 1997, 1998లో ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ల్యాబ్ అసిస్టెంట్లు, లైబ్రరీ అసిస్టెంట్లకు రికార్డు అసిస్టెంట్లతో సమానంగా స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని వారు కోరారు.

దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి పథకంలో భాగంగా ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు అర్హులైన ఎస్సీ నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద శుక్రవారం ప్రకటనలో కోరారు. 21 నుంచి 50 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఈనెల 10వతేదీలోపు సచివాలయంలోగానీ, ఇంటర్నెట్ కేంద్రంలోగానీ ఆర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తుతోపాటు కులధ్రువీకరణ పత్రం, రేషన్, ఆధార్ కార్డులు, ఫొటో, బ్యాంకు పాసుపుస్తకం ప్రతులతో మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో అందజేయాలన్నారు. వివరాలకు మెప్మా విభాగంలో సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

చీనీకాయలు టన్ను రూ.22 వేలు

అనంతపురంరూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22,100, కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1081 టన్నుల చీనీకాయలు వచ్చాయని పేర్కొన్నారు.

నమోదు చేసుకోండి

పుట్టపర్తి టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివథ్ ఎంపికకు ముందస్తు నమోదు రిక్రూట్‌మెంటు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నాలుగేళ్ల పని చేయాల్సి ఉంటుందన్నారు. బెంగళూరులో ర్యాలీ నిర్వహిస్తారన్నారు. https://agnipathvayo వెబ్‌సైట్‌లో ఈనెల 11వ తేదీ 5 గంటల్లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

లక్ష్మీనారాయణది ఫ్యాక్షన్ హత్య కాదు

భూతగాదాలే కారణం.. నిగ్గుతేల్చిన పోలీసులు

ముగ్గురి అరెస్టు.. పరారీలో ఏడుగురు..


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఆలూరు పోలీసులు

గుంతకల్లు, మే2(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు, కాంగ్రెస్ ఆలూరు ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణది ఫ్యాక్షన్ హత్య కాదనీ, భూతగాదా కక్షలే కారణమంటూ పోలీసులు నిగ్గుతేల్చారు. గత నెల 27వ తేదీన గుంతకల్లు-చిప్పగిరి రోడ్డులోని రైలు వంతెన వద్ద ఫ్యాక్షన్ హత్యల్లో నిందితుడిగా ఉన్న లక్ష్మీనారాయణ(60) కారులో వెళ్తుండగా కొందరు కాపుకాచి, టిప్పరుతో అటకాయించి, నరికి చంపిన సంగతి విదితమే. ఆ హత్యతో గుంతకల్లు ప్రజలు, పోలీసులు ఉలిక్కిపడ్డారు. ప్రత్యక్ష సాక్షిగా ఉన్న లక్ష్మీనారాయణ కుమారుడు వినోద్ కుమార్ చిప్పగిరికి చెందిన టీడీపీ నాయకులు వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం మల్లికార్జున చౌదరితోపాటు, కొండా రామాంజనేయులు, అరికెర మల్లేశుపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదుచేశారు. పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్యపై ఆరోపణలు చేశారు. కేసు విచారణ చేపట్టిన ఆలూరు పోలీసులు ఫ్యాక్షన్ కోణంతోపాటు లక్ష్మీనారాయణ చేసిన పంచాయతీల వల్ల ఏర్పడిన కక్షల నేపథ్యంలోనూ దృష్టిసారించి నేర పరిశోధన చేశారు. ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ బృందాలను నియమించి ఐదు రోజుల్లోనే నేరస్థుల నిగ్గు తేల్చారు. బాధితులు ఆరోపించిన విధంగా కాకుండా భూతగాదాల వల్ల కాంట్రాక్టు హత్య జరిగిందని ఆలూరు పోలీసులు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం ఆలూరు పోలీసు స్టేషన్‌లో నిందితులను ప్రవేశపెట్టారు.

హత్య జరిగిందిలా..

గుంతకల్లుకు చెందిన కొందరు వ్యక్తులతో లక్ష్మీనారాయణకు ఉన్న కక్షలే హత్యకు దారితీశాయని పోలీసులు తెలిపారు. గుంతకల్లులోని గాయత్రి ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న 1.10 ఎకరాల స్థలం, సిద్ధార్థనగర్‌లోని 9 ఎకరాల దేవదాయ భూమి, పెద్దన్న అనే వ్యక్తికి సంబంధించిన 8 ఎకరాల భూమి విషయాలుగా గుంతకల్లుకు చెందిన కొందరితో లక్ష్మీనారాయణకు విభేదాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఎస్సీ అట్రసిటీ కేసు పెట్టారన్న కారణంతో కక్షలు పెంచుకుని పథకం ప్రకారం లక్ష్మీనారాయణను హత్యచేశారు. పట్టణానికి చెందిన పెద్దన్న, రాజేశ్, గౌసియాకు భూదందాల విషయంగా లక్ష్మీనారాయణతో విభేదాలు ఏర్పడగా, వారిపై ఎస్సీ అట్రాసిటీ కేసు పెట్టారు. తమ దందాలకు అడ్డుతగలడమే కాకుండా, ఎస్సీ కేసు కూడా పెట్టాడన్న అక్కసుతో హత్యకు కుట్రపన్నారు. 27వ తేదీన చిప్పగిరికి బయలుదేరిన లక్ష్మీనారాయణ కారును నిందితుల్లో ఒకరైన రాజేశ్ ద్విచక్రవాహనంలో అనుసరించాడు. మేకల శ్రీనివాసులు, ధర్మ అనే ఇద్దరు పథకం ప్రకారం రైలు వంతెన వద్ద టిప్పరుతో సిద్ధంగా ఉండి, రాజేశ్‌తోపాటు రాము అనే వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు కారును ఢీకొట్టారు. పెద్దన్న తన వద్ద ఉన్న సుత్తితో కారు అద్దాన్ని పగులగొట్టగా, నవీన్ అనే నిందితుడు ఇనుప రాడ్డుతో లక్ష్మీనారాయణ తలపై బలంగా కొట్టాడు. పెద్దన్న తన వద్ద ఉన్న కొడవలితో తలపై నరికాడు. వీరితోపాటు మరికొందరు ఘటనా స్థలంలో ఉండి ఎవరూ దగ్గరకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. హత్యానంతరం అందరూ పారిపోయారు.

ముగ్గురి అరెస్టు

ఎమ్మార్పీఎస్ నాయకుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య వెనుక 10 మంది హస్తం ఉందని పోలీసులు వెల్లడించారు. గుంతకల్లుకు చెందిన పెద్దన్న, రాజేశ్, బేపార్ గౌసియా, మేకల శ్రీనివాసులుతోపాటు బీ రాము, బీ గోవిందు, వడ్డే నవీన్, ధర్మ, మనోహర్, కత్రిమల సౌభాగ్య ఉన్నారని దర్యాప్తులో తేలిందని పోలీసులు వివరించారు. వీరిలో పెద్దన్న, రాజేశ్, గౌసియా గుంతకల్లు మండలంలోని నక్కనదొడ్డి హైవేలో ఉండగా అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. మిగిలిన ఏడుగురు పరారీలో ఉన్నారనీ, త్వరలో వారందరినీ అరెస్టుచేస్తామని వివరించారు. కాగా బాధితులు అనుమానించిన ప్రసాద్, మల్లికార్జున, మల్లేశ్, రామాంజనేయులుకు ఈ హత్యలో ప్రమేయం లేదని వివరించారు. బాధితులు పత్తికొండ డీఎస్పీ వెంకట రామయ్యపై చేసిన ఆరోపణలన్నీ నిరాధారాలని తేలింది.

నేటి నుంచి గ్రూప్-1 పరీక్షలు

రెండు కేంద్రాలు... 594 మంది అభ్యర్థులు

అనంతపురం టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 9వరకు కొనసాగనున్నాయి. ఈపరీక్షలకు 594మంది అభ్యర్థులు హాజరుకానున్నారని ఇప్పటికే కలెక్టరు వినోద్‌కుమార్ వెల్లడించారు. గ్రూప్-1 పరీక్షలను నగరంలోని పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల, శ్రీబాలాజీ పీజీ కళాశాల కేంద్రాల్లో నిర్వహించనున్నారు. పరీక్షలు ప్రతిరోజు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు కొనసాగనున్నాయి. పీవీకేకే కళాశాలలో 234మంది, శ్రీబాలాజీ పీజీకాలేజ్‌లో 360మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు.

ఏర్పాట్లు సిద్ధం

గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే కలెక్టరు రెండుసార్లు అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పరీక్షల నిర్వహణపై పలు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలు ముగిసేవరకు జేసీ శివనారాయణశర్మ కోఆర్డినేషన్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. పీవీకేకే ఇంజనీరింగ్ కాలేజ్ సెంటర్‌కు లైజనింగ్ ఆఫీసర్‌గా డిప్యూటీకలెక్టరు రామ్మోహన్, శ్రీబాలాజీ పీజీ కాలేజ్ సెంటర్‌కు లైజనింగ్ ఆఫీసర్‌గా డిప్యూటీ కలెక్టరు మల్లికార్జునరెడ్డిలను నియమించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లను నియమించి వారికి పరీక్షల నిర్వహణ, నిబంధనలపై ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. పరీక్షా కేంద్రాలలో అవసరమైన మెటీరియల్, యంత్రాలు, ట్యాబ్‌లు, ఫర్నిచర్స్ ఏర్పాటు చేశారు. కాగా అభ్యర్థుల సమస్యలు, అనుమానాలు తీర్చడం కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈకంట్రోల్ రూమ్ గురువారం నుంచి ఈనెల 9వతేదీ వరకు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు అందుబాటులో ఉంటుంది. అభ్యర్థులు తమసమస్యలు తెలియజేయాలంటే 8500292992, 08554-220009 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయవచ్చని కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు.

అమ్మను మించిన దైవం లేదు

గణపతి సచ్చిదానంద స్వామి


హారతి ఇస్తున్న గణపతి సచ్చిదానందస్వామి

రాప్తాడు, మే 2(ఆంధ్రజ్యోతి): సృష్టిలో అమ్మను మించిన దైవం లేదని గణపతి సచ్చిదానందస్వామి తెలిపారు. మండలంలోని బొమ్మేపర్తి గ్రామంలో మూడు రోజుల నుంచి జయలక్ష్మీమాత జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం జయలక్ష్మీమాత జయంతి సందర్భంగా విగ్రహానికి గణపతి సచ్చిదానందస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శంకరపూజ, రుద్రహోమం, చక్రపూజ ఘనంగా చేశారు. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. గణపతి సచ్చిదానంద స్వామి.. భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

కాంక్రీట్ మిల్లర్ అపహరణ

అనంతపురం క్రైం, మే 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని సూర్యానగర్ రోడ్డు మల్లాలమ్మ గుడి ఎదుట ఉన్న కాంక్రీట్ మిల్లర్‌ను దొంగలు అపహరించారు. గతనెల 28వ తేదీన మిల్లర్‌ను అపహరించినట్లు సుధాకర్‌రెడ్డి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేశారు.

మహిళ ఆత్మహత్య

గుడిబండ, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఆర్ హట్టి గ్రామానికి చెందిన మహేష్ భార్య రోజా(28) గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్‌ఐ రమణ తెలిపిన మేరకు కొన్నేళ్ల నుంచి రోజా కడుపునొప్పితో బాధపడుతుండేది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పునకు ఉరి వేసుకుంది. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి తల్లి పుట్టరంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కారు బోల్తా.. డ్రైవర్ మృతి

ముగ్గురికి గాయాలు

రాప్తాడు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామినేపల్లి సమీపాన జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్ దుర్మరణం చెందగా.. ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక ప్రాంతం దేవనహళ్లికి చెందిన నలుగురు అనంతపురం నుంచి బెంగళూరుకు కారులో బయల్దేరారు. రామినేపల్లి వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలోకి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ మంజునాథ్ (44) అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ప్రదీప్, నగేష్, మోహన్‌రాజ్ గాయపడ్డారు. వారిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు
డ్రైవర్ మంజునాథ్ మృతదేహం

బాలిక నిజాయతీ

ఏటీఎంలో డ్రా అయిన డబ్బు బాధితుడికి అందజేత


డబ్బు అందజేస్తున్న సీఐ, వర్ణిక

తాడిపత్రి, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్‌బజారులో ఉన్న యూనియన్ బ్యాంక్ ఏటీఎం సెంటర్‌కు గతనెల 30న సాయంత్రం వెళ్లిన వర్ణికకు లభించిన రూ.9వేలు పోలీసులకు అప్పగించారు. పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపిన మేరకు... 30న సాయంత్రం ఏటీఎంలో ఎవరో డబ్బులు విత్‌డ్రా చేయాలని ప్రయత్నించారు. ఎంతసేపటికి డబ్బులు రాకపోవడంతో అతను వెళ్లిపోయాడు. కాసేపటికే వర్ణిక అనే బాలిక ఏటీఎం వద్దకు డబ్బు విత్‌డ్రా చేయడానికి వచ్చారు. అయితే అప్పటికే విత్‌డ్రా అయిన సొమ్ము రూ.9వేలు కనిపించడంతో దాన్ని తీసుకొని సీఐకు అప్పజెప్పారు. సీఐ బ్యాంక్ అధికారులను పిలిపించి ఏటీఎంలో ఉన్న సీసీ ఫుటేజీల ద్వారా బాధితుడిని గుర్తించారు. అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌నాయక్ అని తేలడంతో అతన్ని పిలిపించి ఆ డబ్బులను ఆ అమ్మాయి చేతులమీదుగా శుక్రవారం అందజేశారు.

పింఛన్‌పై డీఎల్‌డీవో విచారణ

బెళుగుప్ప, మే 2(ఆంధ్రజ్యోతి): పింఛన్ పంపిణీ చేయకుండా సచివాలయ సిబ్బంది పరారైన సంఘటనపై డీఎల్‌డీవో నాగేశ్వరరావు శుక్రవారం విచారణ చేపట్టారు. మండల కేంద్రంలోని 1వ సచివాలయంలో పని చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ ఉపేంద్ర గురువారం పింఛన్ల నగదు రూ. 2.58 లక్షలుతో ఉడాయించిన విషయం తెలిసిందే. ఎంపీడీవో లక్ష్మీనారాయణ, సెక్రెటరీ శివరంజని, సిబ్బంది దేవేంద్రతో ఎంపీడీవో కార్యాలయంలో ఈ సమస్యపై విచారించారు. పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని సూచించారు. తమకు ఇంకా పింఛన్ల డబ్బు అందలేదంటూ లబ్ధిదారులు పంచాయతీ కార్యాలయానికి తరలివచ్చారు. కాగా ఉపేంద్ర ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు.


ఎంపీడీవో, కార్యదర్శితో వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌డీవో

అయ్యో.. నాన్నా..!

విద్యుదాఘాతంతో ఒక్కగానొక్క కుమారుడి మృతి

సమాచారం తెలిసి.. సబ్‌జైలులో సొమ్మసిల్లిన తండ్రి


అశ్విన్ ఆరాధ్య (ఫైల్)

హిందూపురం, మే 2(ఆంధ్రజ్యోతి): ఒక్కగానొక్క కుమారుడిని అల్లారుముద్దుగా పెంచుకున్నారు. విధి వక్రించింది. కుమారుడిని కరెంటు బలి తీసుకుంది. తల్లిగుండె తల్లడిల్లింది. సబ్‌జైలులో ఉన్న తండ్రి గుండె పగిలింది. స్పృహ కోల్పోయాడు. సబ్‌జైలు నుంచి ఆస్పత్రికి చేరాడు. వారి పరిస్థితిని చూసిన వారంతా.. అయ్యో.. పాపం.. అంటూ ఆవేదన చెందుతున్నారు.

వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వాల్మీకి లోకేష్, చందన దంపతుల కుమారుడు అశ్విన్ ఆరాధ్య (11) పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో చదువుతుండేవాడు. సెలవులు కావడంతో ఇంటివద్దే ఉన్నాడు. శుక్రవారం సాయంత్రం దండు రోడ్డులోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. బంతి పాఠశాల మేడపైకి వెళ్లింది. అశ్విన్ బంతి తీసుకునేందుకు మిద్దెపైకి ఎక్కాడు. మేడపై ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తాకాడు. షాక్ తగిలి పడిపోయాడు. అక్కడే ఉన్న స్నేహితులు.. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని, విద్యార్థిని ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు కావడంతో తల్లి చందన రోదించినతీరు అందరినీ కలచివేసింది.

సొమ్మసిల్లిన తండ్రి

విద్యార్థి తండ్రి వాల్మీకి లోకేష్ ఇటీవల టీడీపీ కార్యకర్త ఇంటి వద్దకు ఇనుప రాడ్‌తో వెళ్లడంతో పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం హిందూపురం సబ్‌జైలులో ఉన్నాడు. కుమారుడి మృతి విషయం తెలుసుకుని లోకేష్ బోరున రోదించినట్లు తెలిసింది. స్పృహ తప్పి పడిపోవడంతో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. కుమారుని అంత్యక్రియల కోసం బెయిల్ ఇవ్వాలని, లేదంటే అంత్యక్రియలు ముగిసేవరకు వెళ్లడానికి అనుమతి అయినా ఇవ్వాలని న్యాయాధికారిని కోరినట్లు లోకేష్ తరఫు న్యాయవాది తెలిపారు.

ఈతకెళ్లి విద్యార్థి మృతి


రూపేష్ (ఫైల్)

నంబులపూలకుంట, మే2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచెలమల గ్రామ సమీపంలోని సబ్‌స్టేషన్ పక్కనున్న యనుముల గంగన్న బావిలో ఈతకెళ్లి విద్యార్థి రూపేష్ (14) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కదిరి రూరల్ మండలంలోని పట్నంకు చెందిన వీఆర్వో గంగాధర్, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు రూపేష్ కదిరిలో ఓ ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి పూర్తి చేశాడు. వేసవి సెలవులు కావడంతో అమ్మమ్మ ఊరైన వెలిచెలమలకు రెండురోజుల క్రితం వచ్చాడు. శుక్రవారం స్నేహితులతో గ్రామ సమీపంలోని యనుముల గంగన్న బావిలో ఈతకెళ్లాడు. స్నేహితులు ఈత కొడుతుండగా, సరదాగా ఉందని రూపేష్ బావిలోకి దూకేశాడు. బయటకు రాకపోవడంతో స్నేహితులు గ్రామంలో తెలిపారు. గ్రామస్థులు బావి వద్దకు చేరుకుని, విద్యార్థి మృతదేహాన్ని యటకు తీశారు. అప్పటికే మృతిచెందాడు. దీనిపై పోలీసులను అడగ్గా.. తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

ఎలుగుబంటి దాడి.. ఇద్దరికి తీవ్రగాయాలు


దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు

కళ్యాణదుర్గం రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని దొడఘట్ట గ్రామంలో గురువారం అర్ధరాత్రి ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. గ్రామానికి చెందిన కరియన్న, మూర్తి ఇద్దరు శెట్టూరు మండలం గొల్లపల్లి గ్రామానికి వెళ్లి అర్ధరాత్రి సమయంలో తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనానికి ఎలుగుబంటి అడ్డుపడింది. కరియన్న పై దాడి చేసింది. గట్టిగా కేకలు వేయడంతో అక్కడికి కొంతమంది ప్రజలు వచ్చారు. వారిలో శ్రీనివాసులు అనే వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. బాధితులను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీనివాసులు పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు దాదాపు 60 కుట్లు వేశారు. శ్రీనివాస్ చికిత్సకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రెండు లక్షలకు పైగా ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు. కాగా గ్రామ పరిసరాల్లో వన్యమృగాలు సంచరిస్తూ, దాడి చేస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్టు

అనంతపురం క్రైం, మే 2(ఆంధ్రజ్యోతి): బాలిక కిడ్నాప్ కేసులో నాలుగో పట్టణ పోలీసులు శుక్రవారం ఇద్దరిని అరెస్టు చేశారు. పదిరోజుల క్రితం ఫోర్త్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ బాలిక అదృశ్యమైంది. తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు విచారించగా కళ్యాణదుర్గం మండలం కొండాపురం గ్రామానికి చెందిన వడిత్యా రామకృష్ణనాయక్.. బాలికను తీసుకెళ్లినట్లు తేలింది. అదే గ్రామానికి చెందిన కమలాక్షిబాయి అతడికి సహకరించినట్లు నిర్ధారించారు. దీంతో పోక్సో కేసుగా మార్చారు. గతనెల 30న దేవేంద్ర పాడులో బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. శుక్రవారం రామకృష్ణనాయక్, కమలాక్షిబాయిని అరెస్టు చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



లేపాక్షి, మే 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మద్యం దుకాణం సమీపాన శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. బార్ పక్కనే శుక్రవారం ఉదయం నుంచి 55 ఏళ్ల వయసున్న వ్యక్తి పడి ఉన్నాడు. కొంతమంది అనుమానం వచ్చి సాయంత్రం పరీక్షించగా మృతిచెందినట్లు గుర్తించారు. అతడి జేబులో మందుబాటిల్, బీడీలు, అగ్గిపెట్టె ఉన్నాయి. పోలీసులకు సమాచారం ఇవ్వగా.. గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

న్యూస్ బాక్స్

బాలికా వికాసంపై అవగాహన

తనకల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపల్లి, మల్లిరెడ్డిపల్లి, టి.స దుం గ్రామాల్లో కిషోర్ బాలికలకు వేసవి శిక్షణలో భాగంగా బేటీ బచావో బేటీ పడావో నినాదంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 11 సంవత్సరాల నుంచి 18 వయసున్న బాలికలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. కిషోర్ వికాసానికే ఈ వేసవి శిక్షణ ఇస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మహిళ పోలీసులు ఫాతిమా, రిహానా, రమాదేవి, కోటపల్లి, మల్లిపల్లి, టి.సదుం పంచాయతీల అంగన్‌వాడీ కార్యకర్తలు, కిషోర్ బాలికలు, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

● బత్తలపల్లి : మండలంలోని సంజీవపురంలో కిషోర బాలికలకు వేసవి శిక్షణ తరగతులు సీడీపీఓ సరస్వతి శుక్రవారం ప్రారంభించారు. జూన్ 10 వరకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఇందులో బాలికలకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమములో సూపర్‌వైజర్ దేవమణి పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్: మండలంలోని కాళసముద్రం అంగన్‌వాడీ కేంద్రంలో కిషోరి వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సూపర్‌వైజర్ నిహారిక తెలిపారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎం, బాలికలు, ఆయాలు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన న్యాయాధికారి


లోకనాథం

కదిరిలీగల్,మే2(ఆంధ్రజ్యోతి): ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారిగా పీ లోకనాథం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పెనుగొండ న్యాయాధికారి బొజ్జప్ప నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా కూడా ఆయన పూర్తి బాధ్యతలు నిర్వహిస్తారు. ఇక్కడ పనిచేసిన ఇద్దరు న్యాయాధికారులు ప్రతిమ, మీనాక్షి సుందరి బదిలీ అయిన విషయం తెల్సిందే.

కేతిరెడ్డి కాలనీలో సోదాలు

ధర్మవరం, మే 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కేతిరెడ్డి కాలనీలో టూటౌన్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం ఉదయం అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. సమస్య వచ్చినపుడు వెంటనే 100 డయల్ చేయాలని సీఐ సూచించారు. కాలనీలో కొత్తవారు ఎవరైనా తిరిగితే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని, సైబర్ నేరగాళ్లపట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

కులగణన నిర్ణయంపై హర్షం


హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

కదిరి అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): దేశంలో కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఆర్ అండ్ బీ బంగ్లాలో శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు మాట్లాడుతూ.. ఈ కులగణన వల్ల అన్ని వర్గాలకు సమాన అవకాశాలు దక్కుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ, ఆచార్య ఆదినారాయణ, శ్యామల, రామాంజి, సూరి పాల్గొన్నారు.

జిమ్‌ల ఏర్పాటుకు స్థలాల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్, నాయకులు

ధర్మవరం, మే 2(ఆంధ్రజ్యోతి): మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఎంపీ నిధులతో పట్టణంలో ఐదు జిమ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు శుక్రవారం శివానగర్, ఎంజీకాలనీ, దుర్గానగర్, రాంనగర్, పోలీసు క్వాటర్స్ ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది, బీజేపీ నాయకులు బిల్లేశీన, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి


ఉపాధి కూలీలతో సీపీఐ నాయకులు

ఓబుళదేవరచెరువు, మే 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు కల్పించి, వలసలను నివారించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి. కదిరప్ప, సీపీఐ మండల కార్యదర్శి చలపతినాయుడు కోరారు. శుక్రవారం మండలంలోని జంబులవాండ్లపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న ప్రాంతాల్లో వెళ్లి కూలీలతో మాట్లాడారు. వృద్ధులకు విడిగా జాబ్‌కార్డు ఇవ్వాలని, అడిగిన వారికి పనులు కల్పించాలని, రోజుకు రూ.700 కూలి ఇవ్వలని, పని కల్పించకపోతే ఉపాధిభృతిగా యేడాదికి ప్రతి కూలికి రూ.12వేలు అందించాలని అన్నారు. వేసవి అలవెన్సులు పునరుద్ధరించాలని, మేట్లును తీసుకొచ్చి, గుర్తింపు కార్డులు అందించాలని కోరారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన

తాడిమర్రి, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకోట్ల, నిడిగల్లు గ్రామాల్లో శుక్రవారం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లలితమ్మ, చంద్రమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ ఆయాలు, సిబ్బందికి కిశోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు హేమలత, సుబ్బలక్ష్మీ, దేవమ్మ పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన

పుట్టపర్తి రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనుమలపల్లిలో క్షయవ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో డీటీసీ సూపర్‌వైజర్ ఆబిద్ బాషా, సీహెచ్ఓ నగేష్, ఎంపీఈహెచ్ ఓ రమణ, ఏఎన్ఎం పరిమళ, అంగన్వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నివాసముంటున్న ముస్లిం, క్రిస్టియన్, బుద్దిస్ట్, సిఖ్, జైన్, పార్శి మతస్థుల్లో ఆసక్తికలవారు మైనార్టీ సబ్సిడీ రుణాలకు ఏపీ ఓబీఎంఎంఎస్ వైబ్‌సైట్ ద్వారా ఈనెల 10 లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుదారులు 21 నుంచి 55 సంవత్సరాలలోపు ఉండాలని, మైనార్టీ ధ్రువీకరణ సర్టిఫికెట్ కలిగి ఉండాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

పగిలిన సత్యసాయి నీటి పైపులైన్

రెండు రోజులుగా నీరు వృథా



బుక్కపట్నం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకంపల్లి గ్రామ సమీపంలో బుక్కపట్నం నుంచి పుట్టపర్తికి వెళ్లే ప్రధాన రహదారిలో సత్యసాయి వాటర్ పైపు లైన్ పగిలి రెండు రోజులుగా నీరు వృథా అవుతోంది. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అసలే వేసవికాలం.. తీవ్ర నీటి ఎద్దడి ఉన్న ఈ సమయంలో ఇలా నీరు వృథా అవుతున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంతో పలు విమర్శలకు తావిస్తోంది.

ఆర్డీటీకి అండగా నిలుద్దాం

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేత ముసుగు మధు

ధర్మవరం, మే 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఆర్డీటీ అనేక సేవలు అందిస్తోందని, అలాంటి సంస్థకు నేడు కుల, మత, రాజకీయాలకు అతీతంగా అండగా నిలుద్దామని పలువురు ప్రముఖులు పిలుపునిచ్చారు. ఎఫ్‌సీఆర్ఏ నిబంధనలో భాగంగా ఆర్డీటీకి విదేశీ విరాళాలు అందని పరిస్థితి నెలకొంది. దీంతో ఆర్డీటీ తన సేవలను కొనసాగించలేని పరిస్థితికి చేరుకుంది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్జీఓహోంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో సీపీఐ, సీపీఎం, జనసేన, ఎమ్మార్పీఎస్, బీఎస్పీతో పాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, మేధావులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ఆర్డీటీ కుల, మతాలకు అతీతంగా సేవలు అందిస్తోందన్నారు. కరోనా సమయంలోనూ ఆర్డీటీ వైద్య సేవలు అందించి.. అనేకమంది ప్రాణాలను కాపాడిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, ఎస్‌టీయూ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కౌన్సిలర్ సుధాకర్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జింకా చలపతి, జనసేన పట్టణ అధ్యక్షుడు అడ్డగిరి శ్యాంకుమార్, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్లు అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి


ఆదిశంకరాచార్యుల చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ధర్మవరం రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పేటబసవన్నకట్టవీధిలోని త్రిలింగేశ్వరుని ఆలయంలో శుక్రవారం జగద్గురు శ్రీఆదిశంకరాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు రాఘవ శర్మ ఆలయం ఎదుట ఆదిశంకరాచార్యుల చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆదిశంకరాచార్యుల చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించి సంకీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కావమ్మ, మారయ్య తిరునాళ్ల ప్రారంభం


అమ్మవారికి వస్త్రాలు తీసుకెళ్తున్న ఏఎస్ఐ

నంబులపూలకుంట, మే 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో కొత్తరోడ్డు వద్ద వెలసిన కావమ్మ, మారయ్య తిరునాళ్ల శుక్రవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారికి స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి వస్త్రాలు తీసుకెళ్లడం ఆనవాయితిగా వస్తోంది. అందులో భాగంగా శుక్రవారం రాత్రి పోలీస్ స్టేషన్ నుంచి ఏఎస్ఐ కిషోర్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఊరేగింపుగా అమ్మవారికి వస్త్రాలు తీసుకెళ్లి.. సమర్పించారు. శనివారం అమ్మవారి కల్యాణం, ఊరేగింపు, అమ్మవారికి సారె కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు శ్రీధర్ తెలిపారు.

ప్రతిభావంత విద్యార్థులకు ప్రోత్సాహకాలు


ప్రతిభావంత విద్యార్థులతో ఎంఈఓ, సీఐ

ధర్మవరం, మే 2(ఆంధ్రజ్యోతి): పది ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన స్థానిక కాకతీయ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆ పాఠశాలలో అభినందసభ నిర్వహించారు. పాఠశాల ఫౌండర్ రామిరెడ్డి ఆ విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. ఇందులో ఎంఈఓ-2 గోపాల్‌నాయక్, టూటౌన్ సీఐరెడ్డప్ప, జేవీవీ జిలా కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి పాఠశాల కరస్పాండెంట్ నిర్మలాదేవి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

మారాలలో గ్రామసభ


గ్రామసభలో మాట్లాడుతున్న డీఎస్పీ

బుక్కపట్నం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారాలలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ శుక్రవారం రాత్రి గ్రామసభ నిర్వహించారు. అందరూ కలిసిమెలసి ప్రశాంత వాతావరణంలో జీవించాలని సూచించారు. నేరాలు, నివారణ చర్యలు, సైబర్ నేరాలు, బాలికలు, మహిళలపై వేధింపులు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఇందులో ఎస్ఐ క్రిష్ణమూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాయితీతో పశువుల దాణా

ఓబుళదేవరచెరువు, మే 2(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు కలిగిన ప్రతి రైతుకు పశు సంవర్ధక శాఖ ద్వారా 50 శాతం రాయితీతో పశువుల దాణా పంపిణీ చేస్తున్నట్లు పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. రైతులు 50 కిలోల బస్తాకు రూ.555 చెల్లించి పశువైద్యశాలలో ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని సూచించారు.


▲ అలంకరణలో స్వామి


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు →

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం

తనకల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం గ్రామ సమీపంలో పాపాగ్ని నది పరీవాహక ప్రాంతంలోని తవళం ఆంజనేయస్వామి రథోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఇందులో పాల్గొన్నారు. వారం రోజులుగా తవళం ఎద్దుల పరస కొనసాగుతోంది. రోజుకో కార్యక్రమం నిర్వహించిన కమిటీ సభ్యులు రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని భక్తులతో పాటు కర్ణాటకలోని చాకివేలు, చేలూరు, బిళ్లురు, అన్నమయ్య జిల్లాలోని పెద్ద తిప్పసముద్రం, ములకలచెరువు నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు కమిటీ ఛైర్మన్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. కదిరి రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

హాకీ స్టిక్‌ల అందజేత


హాకీ స్టిక్‌లతో క్రీడాకారులు

ధర్మవరం, మే 2(ఆంధ్రజ్యోతి): హాకీ సత్యసాయి జిల్లా సంఘం ఆధ్వర్యంలో వేసవికాలంలో శిక్షణ సందర్భంగా 45 మంది హాకీ క్రీడాకారులకు స్టిక్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రసిడెంట్, సత్యసాయి జిల్లా అసోషియేషన్ కార్యదర్శి బంధనాదం సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.... వేసవి శిక్షణలో క్రీడాకారులందరూహాజరై మెలుకువలు నేర్చుకుని హాకీని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో హాకీ సత్యసాయి జిల్లా వైస్ ప్రసిడెంట్ గౌరీప్రసాద్, ట్రెజరర్ అంజన్న, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ హాకీ కోచ్ హస్సేన్, జిల్లా జాయింట్ సెక్రటరీ అరవిందగౌడ్, చంద్ర, డైరెక్టర్ మారుతి, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

యంగ్ ఇండియన్ బ్లడ్ సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న లక్ష్మణ్

కదిరి అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన అఖిల భారత చిరంజీవి యువత కదిరి నియోజకవర్గ అధ్యక్షుడు కుటాల లక్ష్మణ్‌కు యంగ్ ఇండియన్ బ్లడ్ సేవా పురస్కారం లభించింది. అత్యవసర పరిస్థితుల్లో అనేక మందికి రక్తదానం చేసిన ఆయన సేవలను గుర్తించిన యంగ్ ఇండియన్ సంస్థ .. ఈ అవార్డును అందజేసింది. గురువారం హైదరాబాద్‌లో ఈ పురష్కారాన్ని ఆ సంస్థ అందజేసి.. సన్మానించింది.

వినియోగంలోకి చలివేంద్రం

ముదిగుబ్బ, మే 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వారపు సంతలో కనీస సౌకర్యాలు లేవు. వేసవి ప్రారంభం కావడంతో కనీసం తాగునీటి సౌకర్యం కల్పించాలని చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే వ్యాపారులు, ప్రజలు అధికారులను విజ్ఞప్తి చేశారు. దీంతో పంచాయతీ అధికారులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి.. చేతులు దులుపుకున్నారు. నిర్వహణ లేకపోవడంతో అది నిరుపయోగంగా మారింది. దీనిపై ఆంధ్రజ్యోతి శుక్రవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన అధికారులు ఆ చలివేంద్రాన్ని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకున్నారు.


వారపు సంతలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

రైతులకు ఏఐ సేవలపై అవగాహన


ఏఐ సేవలను వివరిస్తున్న అధికారులు

తనకల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులకు ఏఐ ఆధారిత సేవలపై జిల్లా ఉద్యాన వన శాఖాధాకారి చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక చైతన్య ఫార్మర్ ప్రొడ్యూషర్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్న, సన్నకారు రైతులకు అవసరమైన ఇన్‌పుట్ ఇతర సేవలను అందించడంలో డిజిటల్ గ్రీన్ సంస్థ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తోందన్నారు. ఆ పరిజ్ఞానాన్ని ప్రతి ఒకరూ ఉపయోగించుకోవాలన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఫ్యూచర్ ద్వారా ఎఫ్‌పీఓలు తమ ఉత్పత్తులు, సేవలను ఫార్మర్ చార్టు ఇంటర్ ఫెస్‌లో చూడవచ్చన్నారు. రైతు సంఘాల ద్వారా రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు పొందవచ్చన్నారు. ఏఐ సహాయంతో వ్యవసాయ సలహాలను మరింత సులభంగా.. త్వరగా లభిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ సిబ్బంది లావణ్య, డిజిటల్ గ్రీన్ సంస్థ ఉపాధ్యక్షుడు టెక్‌లీడ్ ఎండీ రజాక్, చైతన్య ఫార్మర్ ప్రొడ్యూజర్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తనకల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని కదిరికి చెందిన బాబ్‌జాన్ శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాబ్‌జాన్ తనకల్లు మండలంలోని కొక్కంటి గ్రామంలో వివాహం చేసుకున్నాడు. గత కొంతకాలంగా భార్య కాపురానికి రాకుండా పుట్టింటిలోనే ఉండిపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన బాబ్‌జాన్ శుక్రవారం మద్యంతో పాటు పురుగుల మందు తాగాడు. పోలీస్ ఎదుట అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి రావడానికి అతని భార్య నిరాకరించినట్లు పోలీసులు తెలిపారు.

పొక్సో కేసు నమోదు

నల్లమాడ, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు మాయమాటలు చెప్పి వివాహం చేసుకుందామని తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న బాలిక తండ్రి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా బాలిక, యువకుడు హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. వారిని పోలీస్‌స్టేషన్ తీసుకొచ్చారు. యువకుడిపై పొక్సో కేసు నమోదు చేసి, కదిరి కోర్టులో హాజరుపరిచి.. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నరేంద్రరెడ్డి శుక్రవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తనకల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటి క్రాస్ సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని బత్తినవారిపల్లికి చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. నగేష్, మౌనిక, రెడ్డిప్రసన్న బత్తినవారిపల్లి బైక్‌లో వెళ్తుండగా.. కొక్కంటి క్రాస్ సమీపంలోని ఐచర్ వాహనం వీరి బైక్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో మౌనిక, రెడ్డిప్రసన్న తీవ్రంగా గాయపడగా.. నగేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని కదిరి ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరు..

పుట్టపర్తి రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పడంతో కిందపడి చెర్లోపల్లికి చెందిన ఆర్మీ కానిస్టేబుల్ లక్ష్మీపతి, ప్రభాకర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిద్దరూ శుక్రవారం రాత్రి పుట్టపర్తి నుంచి చెర్లోపల్లికి బుల్లెట్ వెళ్తుండగా.. మండలంలోని వీరాంజినేయపల్లి వద్ద బైక్ అదుపుతప్పి.. ఈ ఇద్దరూ కిందపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ వీరిని సత్యసాయి జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. లక్ష్మీపతి పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగుళూరు ఆర్మీ ఆస్పత్రికి తరలించారు.

● ధర్మవరం: పట్టణ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా అనంతపురం పట్టణం మారుతీనగర్‌కు చెందిన శ్రీనివాసులు బైక్ అదుపు తప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతను పని నిమిత్తం ధర్మవరానికి వచ్చి తిరిగి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడ్డ అతడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స నిమిత్తం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

వ్యక్తి అదృశ్యం


భాస్కర్

బుక్కపట్నం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగప్పగారిపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు అదృశ్యమైనట్లు తల్లి జయమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. భాస్కర్ రెండు నెలల నుంచి కనిపించడం లేదని అప్పటి నుంచి బంధువులు, తెలిసినవారి వద్ద విచారించినా ఫలితం లేకుండాపోయిందని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 6305585955, 9381961908 నంబర్లలో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

డిగ్రీ విద్యార్థిని...

ధర్మవరం: పట్టణంలోని బంధువుల ఇంటికి వచ్చిన ఓ యువతి అదృశ్యమైనట్లు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. హిందూపురం మండలం చలివెందల గ్రామానికి చెందిన అంకేమహేశ్వరి, నరసింహమూర్తి కుమార్తె జ్యోత్స్న అనంతపురంలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. మూడు రోజుల క్రితం ధర్మవరంలోని గూడ్‌షెడ్ కొట్టాలలో ఉన్న తన పెద్దమ్మ గంగాదేవి ఇంటికి వచ్చింది. గురువారం ఇంటి నుంచి వెళ్లిన జ్యోత్స్న.. తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి వద్ద గాలించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆ విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కింద కేసు నమోదు చేసినట్టు సీఐ రెడ్డప్ప తెలిపారు.

మహిళపై దాడి .. నలుగురిపై కేసు

ధర్మవరం, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జోగోనికుంటలో ఆశాది వెంకట నాగిణిపై నలుగురు దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. నాగిణి మామిడికాయల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. మామిడికాయలు కొనుగోలు విషయంలో నాగిణిపై లక్ష్మీనారాయణ, కవిత, కాటమయ్య, గంగమ్మ దాడి చేసి గాయపరిచారు. దీంతో నాగిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ నలుగురిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు శుక్రవారం తెలిపారు.

ముగ్గురిపై ..

ధర్మవరం: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన మరస హరిపై వైఎస్ఆర్ కాలనీకి చెందిన ముగ్గురు శుక్రవారం దాడి చేశారు. వైఎస్ఆర్ కాలనీలో ఉన్న మరస హరి మేనకోడలు గౌతమి తనను ఎదురింటిలో ఉన్న నాని అనే అతను కామెంట్లు చేస్తున్నాడని చెప్పింది. దీంతో మరస హరి మేనకోడలి వద్దకు వెళ్లి విచారిస్తుండగా నాని, అతని తల్లి రాజమ్మ, తండ్రి జగదీశ్ హరితో గొడవకు పెట్టుకున్నారు. హరిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో స్థానికులు అడ్డుకుని గాయపడిన హరిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు జరిగిన ఘటనపై హరితో తెలుసుకుని ఆయన ఫిర్యాదు మేరకు నాని, అతని తల్లి రాజమ్మ, తండ్రి జగదీశ్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ రెడ్డప్ప తెలిపారు.

అక్రమ లే అవుట్లలో రాళ్ల తొలగింపు

నంబులపూలకుంట, మే 2(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల సమీపంలో ఆహుడా అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్లలోని రాళ్లను ఈఓఆర్డీ మాధవరెడ్డి, ఎంపీడీఓ ఆంజనప్ప ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు శుక్రవారం తొలగించారు. సర్వేనెంబర్ 275, 276, 277, 278, 561, 563, 564 నెంబర్లలో అనుమతి లేకుండా ప్లాట్లు వేశారని, ఈ ప్లాట్లు కొనుగోలు చేస్తే ఇంటి నిర్మాణాలకు పంచాయతీ అనుమతులు ఉండవని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. ఇలా ప్లాట్లు విక్రయిస్తున్న యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.

సీహెచ్‌ఓల సమ్మెకు పలువురి మద్దతు

పుట్టపర్తి రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాని సీహెచ్‌ఓలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి ఐదో రోజుకు చేరింది. వీరికి ఏపీఎన్జీఓ సంఘం నాయకుడు లింగారాం మోహన్, ఉపాధ్యాయ సంఘం, ఏపీఎస్ ఆర్టీసీ సంఘం, వైద్య ఆరోగ్య సంఘం నాయకులు మద్దతు తెలిపారు.


సీహెచ్‌ఓల సమ్మెలో ఏపీఎన్జీఓ సంఘం నాయకులు

అభివృద్ధి దిశగా పురం అడుగులు

పట్టణాభివృద్ధికి రూ.300కోట్ల నిధుల విడుదలకు సీఎం చంద్రబాబు ఆదేశాలు

వచ్చేనెలలో ప్రారంభం కానున్న పనులు

హిందూపురం, మే 2(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ హయాంలో హిందూపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. అయితే ప్రభుత్వం మారడంతో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. మిగతా నియోజకవర్గాల కంటే హిందూపురం నియోజకవర్గానికి అధిక నిధులు తెచ్చేందుకు కృషిచేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే పలుసార్లు కలిశారు. దీంతోపాటు అభివృద్ధి నిధులు తీసుకురావడానికి టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పీఏ వీరయ్య ప్రత్యేక దృష్టి పెట్టారు. గత తెలుగుదేశం హయాంలో పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.66కోట్లు నిధులు మంజూరు చేశారు. అప్పట్లో రోడ్లు చదును చేశారు. ప్రభుత్వం మారడంతో నిధులు రాలేదు. అప్పటి నుంచి పట్టణంలో ఒక్క రోడ్డు కూడా వేసిన పాపానపోలేదు. ప్రస్తుతం అదేరోడ్డుకు సంబంధించి రూ.92కోట్లు కావాలని నివేదికలు పంపారు. దీనికి సంబంధించి నిధులు కూడా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఇటీవల శ్రీనివాసరావు, వీరయ్య కలిశారు. వెంటనే నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు

పట్టణంలో రూ.300కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపారు. ఇందులో పట్టణంలో రహదారుల విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.92.50కోట్లు, పట్టణంలో ఇంటింటికీ నీరు సరఫరాకు అవసరమైన పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.136కోట్లు ప్రతిపాదనలు పంపగా ఆమోదం తెలిపారు. అహుడా ద్వారా రూ.15కోట్లు ప్రతిపాదనలు పంపారు.



త్వరలో పనులు ప్రారంభం కానున్న రైల్వే రోడ్డు

అందుకు సంబంధించిన నిధులు కూడా విడుదల అవుతాయని తెలిసింది. రైల్వేరోడ్డు విస్తరణ పనులకు ఆ నిధులు వినియోగించనున్నారు. ఇదిలా ఉంటే హిందూపురం-మడకశిర బ్రాంచ్ కెనాల్ వెడల్పు, లైనింగ్ పనులకు రూ.1124కోట్లు విడుదల చేయాలని సీఎంను కోరారు. స్పందించిన సీఎం నిధుల విడుదలకు హామీ ఇచ్చినట్లు సమాచారం. గుడ్డం కోనేరు అభివృద్ధికి రూ.1.50కోట్లు నిధులు మంజూరుకు ఆర్థిక శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతోపాటు అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపారు.

వచ్చే నెలలో పనులు ప్రారంభం

పట్టణంలో అభివృద్ధి పనులు వచ్చేనెల నుంచి ప్రారంభం కానున్నట్లు నాయకులు తెలిపారు. ఇప్పటికే నిధుల విడుదలకు ముఖ్యమంత్రి ఆదేశాలు ఇవ్వగా టెండర్ల ప్రక్రియ సాగుతుందని జూన్ నుంచి పనులు ఒక్కొక్కటే ప్రారంభం అవుతాయన్నారు. మొదట రైల్వే రోడ్డు విస్తరణ, విద్యుత్ స్తంభం ఏర్పాటు పనులు ప్రారంభం కానున్నాయి. అనంతరం డీఎల్ రోడ్డు విస్తరణ పనులు కూడా రెండు మూడు నెలల్లో ప్రారంభించనున్నారు. పట్టణంలో విద్యుత్ బల్బులు ఐదేళ్లలో ఏర్పాటు చేయలేదు. దీంతో ఒకేసారి 850ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేస్తున్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి



పెనుకొండలో శంకరాచార్యుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



హిందూపురంలో ఊరేగింపు..

పెనుకొండ, మే 2(ఆంధ్రజ్యోతి): ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలను స్థానిక శంకరాచార్య మఠంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఘనగిరి బ్రాహ్మణ సేవా సంఘం, ఆది శంకరాచార్య సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక బ్రాహ్మణ వీధిలో వెలసిన శంకరాచార్య మఠంలో స్వామివారి వేడుకలు జరిగాయి. ఉదయం నాగప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శారదాంబ, శంకరాచార్యుల విగ్రహాలను వారి పాదుకలను శంకరాచార్య, మధ్వాచార్యులు, రామానుజాచార్యులు చిత్రపటాలను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శంకరాచార్యుల పాదుకలకు ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శంకరమఠంలో బ్రాహ్మణులకు అన్నసంతర్పణ చేపట్టారు.

హిందూపురం, (ఆంధ్రజ్యోతి): శంకరాచార్యుల జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో విగ్రహాన్ని ఊరేగించారు. కోట ప్రాంతంలోని శంకరాచార్యుల ఆలయం వద్ద నుంచి విగ్రహాన్ని గాంధీ సర్కిల్ వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. కేరళ బృందం వాయిద్యాలతో అలరించారు.

మజ్జిగ వితరణ

గోరంట్ల, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినాయక ఆలయం వద్ద శ్రీమణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ జరిగింది. జగద్గురు శ్రీఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా గురుస్వామి తిప్పన్న ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు చిన్నప్పరెడ్డి, అశోక్ పాల్గొన్నారు.



పెనుకొండలో ప్రత్యేక అలంకరణలో ఆదిశంకరాచార్యుడు

చిలమత్తూరు, (ఆంధ్రజ్యోతి): ఆదిగురువు శంకరాచార్యుల జయంతి వేడుకలను మండల బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరాచార్యుల చిత్రపటాన్ని పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిత్రపటాన్ని రథంలో ఉంచి ఊరేగించారు. హిందూధర్మాన్ని కాపాడటం కోసం శంకరాచార్యులు ఎంతో కృషి చేశారని బ్రాహ్మణ సంఘం నాయకులు పేర్కొన్నారు. శంకరాచార్యులు సాక్షాత్తు శివుని అవతారమని నమ్మకమన్నారు. దుష్టాచారాలను నశింపచేసేందుకు కైలాస శంకరుడే ఆది శంకరుని రూపంలో అవతరించారన్నారు. ఆయన సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాల్సి ఉందన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

పావగడ (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ శంకరాచార్యులను ఆదర్శంగా తీసుకోవాలని సర్వధర్మశాంతి పీఠం అధ్యక్షుడు రామ్మూర్తి స్వామీజీ సూచించారు. శుక్రవారం రామానుజాచార్య, శంకరాచార్యుల చిత్రపటానికి పూలమాలలువేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పేద మహిళలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. బ్రాహ్మణ వీధిలో శంకరాచార్య, రామానుజాచార్య చిత్రపటాలను సాంస్కృతిక కార్యక్రమాల నడుమ వైభవంగా ఊరేగించారు.

ఔషధాలకు మల్బరీ ఆకు

వేసవిలో పట్టుపురుగుల పెంపకంతో నష్టం

ప్రత్యామ్నాయంగా మల్బరీ ఆకు విక్రయం



ఎండ బెట్టిన మల్బరీ ఆకు



ఎండిన మల్బరీ ఆకులను సంచుల్లో నింపుతున్న దృశ్యం

మడకశిర రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): వేసవిలో పట్టుపురుగుల పెంపకం రైతులకు కష్టంగా మారుతోంది. ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉంటుండటంతో పట్టుపురుగుల పెంపకం కష్టంగా ఉంటోంది. ఒకవేళ పట్టుపురుగుల పెంపకాన్ని కొనసాగించినా రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు మల్బరీ ఆకులను ఔషధాల కంపెనీలకు విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు. మడకశిర నియోజకవర్గంలో మడకశిర, గుడిబండ, రొళ్ల, అమరాపురం, అగళి మండలాల్లో 11 వేల ఎకరాల్లో మల్బరీ తోటలను సాగు చేస్తున్నారు. పట్టుగూళ్ల ఉత్పత్తిలో మడకశిర నియోజకవర్గం ఉమ్మడి జిల్లాలో మొదటిస్థానంలో ఉంది. అయితే వేసవికాలంలో మాత్రం పట్టురైతులు పట్టుగూళ్ల ఉత్పత్తికి మాత్రం వెళ్లడంలేదు. నష్టాలను చవిచూడాల్సి వస్తుందని వారు మల్బరీ ఆకులను అమ్ముకుంటూ లాభాలు గడిస్తున్నారు. ఈ లాభాలు రైతులకు ఊరటనిస్తున్నాయి.

పట్టుపురుగుల పెంపకం కష్టం



వేసవి కాలంలో పట్టుపురుగుల పెంపకం కష్టం. ఎండ తీవ్రంగా ఉండటంతో సాగు చేసిన రైతులు నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. దీంతో మార్చి నుంచి జూలై వరకు మల్బరీ పట్టుగూళ్ల పెంపకం మానేసి మల్బరీ ఆకులను ఎండబెట్టి వాటిని ఔషధ కంపెనీలకు అమ్ముకుంటున్నాం

-వేమారెడ్డి, మల్బరీ రైతు, పాపసానిపల్లి

ఆకు అమ్మడంతోనే లాభాలు



ఎండకాలంలో పట్టుపురుగుల పెంప కం కంటే మల్బరీ ఆకులను అమ్ముకోవడం తోనే లాభాలు వస్తున్నాయి. విజయవాడకు చెందిన ఓ కంపెనీ ఈ ఆకులను కొనుగోలు చేస్తోంది. కొంత మంది రైతులు వేసవిలో పట్టుగూళ్ల పెంపకం చేయడంతో వారికి అధిక నష్టాలు వచ్చాయి.

-సోమకుమార్, మల్బరీ రైతు, మడకశిర

ఆకుతో లాభాలు

వేసవిలో పట్టుపురుగు పెంపకం రైతులకు కష్టంగా ఉంటోంది. దీంతో మల్బరీ ఆకులను రైతులు ఔషధ కంపెనీలకు విక్రయిస్తున్నారు. దీంతో లాభాలు గడిస్తున్నారు.

- రాజు, సెరికల్చర్ ఏడీ, మడకశిర

మురుగునీటిలో మంచి నీటి పథకం

సోమందేపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దకుంటపల్లి గ్రామ నడిబొడ్డున ప్రజలు తాగునీటి అవసరాల కోసం ఏర్పాటుచేసిన మంచినీటి పథకం మురుగు కాలువ నీరు చేరి కలుషితంగా మారింది. ఆ పక్కనే ప్రాథమిక పాఠశాల ఉండటం తాగునీటి కొళాయి మురుగు కాలువలోనే ఏర్పాటు చేయడంతో నీరు కలుషితమై రోగాలు ప్రబలే ప్రమాదం ఉంది. మంచినీరు కావాలంటే కాలువలో రాయిపెట్టి దానిపై బిందెలు ఉంచి నీటిని పట్టుకోవాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత ప్లేట్లు అక్కడే కడుక్కుని ఆ కొళాయి నీటినే తాగడానికి పట్టుకెళ్తున్నారు. వేసవి సందర్భంగా తాగునీటి సమస్య లేకపోయినా మంచినీటి పథకానికి ఆనుకుని మురుగు కాలువ ఉండటం అదికాస్త అధ్వాన్నంగా మారి ఆ మురుగునీరు పథకం ట్యాంకు చుట్టూ నిలబడి ఉండటంవల్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పథకానికి నీరు సరఫరాచేసే బోరు పైప్‌లైన్ అందులోంచి ట్యాంకుకు బిగించి ఉన్నారు. పొరపాటున పైప్‌లైన్ లీకేజీ అయితే ఏంటి పరిస్థితి అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీరు మంచినీటిలో కలిసి సరఫరా అయితే విద్యార్థులు, గ్రామస్థులు, ఆ నీటిని తాగితే జరిగే నష్టం గురించి అధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఏదైనా జరిగితే చూద్దాంలే అన్న అధికారుల తీరు పలు విమర్శలకు తావిస్తోంది. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మురుగు కాలువలోనే కొళాయి, మంచినీటి పథకం పైప్‌లైన్ ఉన్న దృశ్యం

న్యూస్ బాక్స్

అమ్మవారికి లక్ష గాజుల పూజ



లక్ష గాజులతో అమ్మవారు

హిందూపురం, మే 2(ఆంధ్రజ్యోతి): వాసవీ జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం రెండోరోజు కన్యకాపరమేశ్వరి అమ్మవారికి లక్షగాజుల పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు లక్ష గాజులను అమ్మవారికి సమర్పించారు. గోపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

కాళీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనుకొండ, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన కాళీమాత ఆలయంలో శుక్రవారం ఆలయ అభివృద్ధికమిటీ సభ్యులు సంజీవప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఉదయం అర్చకులు అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని పెద్దసంఖ్యలో తరలివచ్చి సందర్శించుకున్నారు.

రుణాలు రెన్యువల్ చేయండి: సీపీఐ



బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

సోమందేపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద నుంచి వడ్డీ కట్టుకుని రుణాలు రెన్యువల్ చేయాలని కోరుతూ శుక్రవారం సీపీఐ నాయకులు శ్రీరాములు, బాలస్వామి, రమేష్ కెనరా బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుణాల రెన్యూవల్ సందర్భంగా చేతిలో డబ్బు రైతులు వడ్డీకి అప్పు చేసి రెన్యూవల్ చేయిస్తున్నారన్నారు. బయట వడ్డీదారులకు, బ్యాంకులకు డబ్బు చెల్లిస్తూ నష్టపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో కేవ లం వడ్డీ కట్టించుకుని రుణాలు రెన్యువల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల నాయకులు రాజగోపాల్, చాంద్‌బాషా, చీల నారాయణస్వామి పాల్గొన్నారు.

సబ్సిడీ పరికరాల పంపిణీ



సబ్సిడీ పరికరాలు పొందిన రైతులు

మడకశిర టౌన్, మే2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు శుక్రవారం మడకశిర వ్యవసాయ కార్యాలయం అవరణంలో సబ్సిడీతో స్ప్రేయర్లు, గుంటికలను మండల వ్యవసాయ శాఖ అధికారి తిమ్మప్ప అందజేశారు. పలువురు రైతులు దరఖాస్తు చేసుకోగా 50శాతం సబ్సిడీతో ఐదుగురికి స్ప్రేయర్లు, 8మందికి గుంటికలను పంపిణీ చేశారు, కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు కోట్ల రంగేగౌడ్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

శరవేగంగా సబ్‌స్టేషన్ పనులు



కొనసాగుతున్న సబ్‌స్టేషన్ పనులు

పరిగి, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడేటి సబ్‌స్టేషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో దాదాపు 26 గ్రామాలకు, పంట పొలాలకు విద్యుత్ సరఫరా కానుంది. విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేస్తే రైతులకు, ప్రజలకు విద్యుత్ సమస్య తీరనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మడకశిర టౌన్, మే2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం మడకశిర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఫుట్‌బాల్ నేర్చుకోవడంపై ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనవచ్చని అసోసియేషన్ సభ్యులు డాక్టర్ రవి శంకర్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ శిబిర ప్రారంభంలో అసోసియేషన్ సభ్యులు నవీద్, మోహన్, నాగభూషణం పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

హిందూపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): చలివెందులలో వెలసిన లక్ష్మీగవి రంగనాథస్వామి బ్రహ్మరథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. స్వామివారికి రథోత్సవం వద్ద అగ్నిహోమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష పూజలు చేసి ఉత్సవ విగ్రహాన్ని రథోత్సవంపై ఉంచి మీనకుంటపల్లి రోడ్డు వరకు రథాన్ని లాగారు. రథోత్సవానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు.



రోగులపట్ల నిర్లక్ష్యం వద్దు: డీసీహెచ్‌ఎస్



వైద్య సిబ్బందితో చర్చిస్తున్న రవికుమార్

గోరంట్ల, మే2 (ఆంధ్రజ్యోతి): వైద్యులు రోగులకు వైద్యం అందించే విషయంలో నిర్లక్ష్యం వహించరాదని డీసీహెచ్ఎస్ రవికుమార్ సూచించారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. గోరంట్ల ఆసుపత్రిలోని మెడికల్ అధికారి వినోద్‌కుమార్, పోస్టుమార్టం అసిస్టెంట్ రాధమ్మకు మధ్య విధులు నిర్వహించే విషయంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో డిసిహెచ్ఎస్ రవికుమార్ ఆసుపత్రిని సందర్శించి పనితీరును పరిశీలించారు. సమస్యకు కారణమైన ఉద్యోగిని బదిలీ చేశామని, నలుగురు ఉద్యోగుల పనితీరు సరిగా లేకపోవడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మళ్లీ తప్పు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్తగా గోరంట్లకు సివిల్ అసిస్టెంట్ జనరల్ సర్జన్ తేజశ్విని నియమించామన్నారు. అలాగే ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలో భర్తీచేస్తామన్నారు. జిల్లాలోని గోరంట్ల, నల్లమాడ, తనకల్లు, కొత్తచెరువు, రొళ్ల ఆసుపత్రుల్లో మార్చురి ఏర్పాటు చేసి నెలరోజుల్లో ఇక్కడే శవాలకు పోస్టుమార్టం జరిగేలా చర్యలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు వినోద్‌కుమార్, ఉషా, వేణుగోపాల్, తేజశ్విని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోరంట్ల, మే 2(ఆంధ్రజ్యోతి): గోరంట్ల సబ్‌స్టేషన్ పరిధిలోనిలో పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బాలక్రిష్ణనాయక్ తెలిపారు. గుమ్మయ్యగారిపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతుండడంతో శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటలవరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గోరంట్ల, పాలసముద్రం, వడిగేపల్లి, మల్లాపల్లి, గడ్డంతండా, పుట్టగుండ్లపల్లి, మందలపల్లి, కరావులపల్లితండా పంచాయతీలోని పలు గ్రామల్లో విద్యుత్ సరఫరా ఉండదని ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

డ్రిప్, పైపుల చోరీ

గోరంట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌనివారిపల్లికి చెందిన రైతు మునీంద్రరెడ్డి పొలంలోని డ్రిప్ పైపులు గురువారం రాత్రి చోరీకి గురయ్యాయి. రెండేళ్ల క్రితం పది ఎకరాల్లో డ్రిప్ వేసుకుని అప్పటి నుంచి కూరగాయలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట పూర్తికాగా భూమిని దుక్కించేయడానికి డ్రిప్ పైపులు తొలగించి పొలంలోనే మూడుచోట్ల కుప్పగా వేసినట్లు రైతు తెలిపారు. 8 ఎకరాల్లోని డ్రిప్ పైపులను గుర్తుతెలియని వ్యక్తులు ప్రత్యేక వాహనంలో వచ్చి ఎత్తుకెళ్లినట్లు వివరించాడు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రత్యేక తరగతులు: ఎంఈఓలు

అగళి, మే 2(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆదేశాలతో మండలంలోని మధుడి, అగళి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు శ్రీనివాసభాస్కర్, చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. విద్యార్థులు ఫెయిలైన సబ్జెక్టులకు ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు బోధన చేస్తారన్నారు. మండలంలోని విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ప్రవేశ పరీక్ష

గుడిబండ, మే 2(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మహాత్మజ్యోతి రావుఫూలే బాలికల జూనియర్ కళాశాలలో ఈనెల 4న ఆదివారం ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఎంజేపీ ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులు ఉదయం 11 గంటలలోపు పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని కోరారు.

25శాతం సీట్లను కేటాయించాలి: ఎంఈఓ

మడకశిర టౌన్/రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలని ఎంఈఓ శ్రీనివాస్ భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. మండల పరిధిలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వం నిర్ణయం మేరకు 25శాతం సీట్లు కేటయించాలని ఆదేశించారు. ఆసక్తి ఉన్న విద్యార్థుల సచివాలయాల్లో, నెట్‌సెంటర్లలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూన్ 11 అనంతరం సీట్లు మిగిలితే మరోసారి దరఖాస్తుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు.

అమరాపురం(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు అమరాపురం మండల విద్యాధికారి రాఘవయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

'విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తాం'



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్మన్, నాయకులు

హిందూపురం, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విద్యుత్ సమస్యలేకుండా చూస్తామని నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ముద్దిరెడ్డిపల్లిలోని భాగ్యనగర్‌లో 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో లో ఓల్టేజీ సమస్యలేకుండా అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రమేష్, సురేంద్ర, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

ధర్మవరం, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంధువుల ఇంటికి వచ్చిన ఓ యువతి అదృశ్యమైనట్లు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. హిందూపురం మండలం చలివెందల గ్రామానికి చెందిన అంకేమహేశ్వరి, నరసింహమూర్తి కుమార్తె జ్యోష్న అనంతపురంలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. మూడు రోజుల క్రితం ధర్మవరంలోని గూడ్‌షెడ్ కొట్టాలలో ఉన్న తన పెద్దమ్మ గంగాదేవి ఇంటికి వచ్చింది. గురువారం ఇంటి నుంచి వెళ్లిన జ్యోత్స్న .. తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి వద్ద గాలించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆ విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

50శాతం ఉత్తీర్ణత

పావగడ, మే 2(ఆంధ్రజ్యోతి): టెన్త్ ఫలితాలను మౌల్యమాపన మండలి శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రకటించింది. తాలూకా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో 50శాతం ఉత్తీర్ణత కాగా రెసిడెన్షియల్ పాఠశాలలో 85శాతం ఉత్తీర్ణత వచ్చింది. తాలూకావ్యాప్తంగా 776మంది ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు పరీక్షలు రాయగా 391మంది ఉత్తీర్ణత సాధించగా, ఎయిడెడ్ పాఠశాలలో 1044మంది పరీక్ష రాయగా అందులో 387 మంది ఉత్తీర్ణత సాధించారు. నాన్ ఎయిడెడ్ స్కూళ్లల్లో 527మంది గాను 371ఉత్తీర్ణత సాధించగా రెసిడెన్షియల్ పాఠశాలల్లో 410కి గాను 350 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు డీఈఓ ఇంద్రాణమ్మ తెలిపారు.

'మాదిగ అని నమోదు చేయించండి'

పావగడ, మే 2 (ఆంధ్రజ్యోతి): కులం ఉనికిని కాపాడుకోవడానికి ఈనెల 5నుంచి 17వరకు జరిగే జాతీయ జనాభా లెక్కల్లో మాదిగ అని నమోదు చేయించాలని ప్రముఖ దళిత నాయకుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ బసవలింగప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం జనాభాలెక్కల కరపత్రాలను విడుదల చేశారు. సుదీర్ఘ పోరాటంతోనే వర్గీకరణ సాధ్యమైందని దళిత నాయకుడు నరసప్ప అన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు డీజే నారాయణప్ప, టిఎన్ పేట రమేష్ పాల్గొన్నారు.